దసరా కథల పోటీల్లో

ప్రత్యేక ప్రశంస పొందిన కథ

# రాస్తా రోకో

## ఎస్. మోహన హరి

నిశ్శబ్దం

నిర్మానుష్యం

కళ్ళనిండా ఆవేదన ఆశ్రురూపంలో కరిగించుకుంటూ నిప్పులసెగలు సూరిగాడి మనసుని, శరీరాన్ని తూట్లు పొడుస్తున్నాయి.

తప్పదు. తను బయటకు రాక తప్పదు. రెక్కాడితేనే డొక్కాడని పరిస్థితి తనది.

"ఇయ్యాల ఎట్లాగైనా పైసల బందోబస్తు చెయ్యాలి" అనుకున్నాడు.

అతనికి తన కూతురు గుర్తుకొచ్చింది. మూడు రోజుల్నుంచీ జ్వరం. గవర్నమెంటు హాస్పిటల్లో చచ్చీ చెడీ గంటలకొద్ది నిల్చుంటే వాళ్ళిచ్చిన మందులు తన పేదరికాన్ని వెక్కిరించాయి.

అస్సలు- రెండు రోజులనుంచీ తింటానికే కూడు లేదు. నాలుగేళ్ళ నుంచీ రిక్షాలాగుతున్నాడు. కానీ, ఏం లాభం? ప్రతివాడికి రిక్షాలో కూర్చోవాలంటే నామోషి కాబోలు ఆటోల్లో, టాక్సీలలో ఎక్కేళ్ళిపోతున్నారు.


పొద్దున్నుంచీ సాయంత్రం వరకు రిక్షాలాగితే రోజుకి సరిపడే గిరాకీ దొరుకుతుందాతనికి.

అయితే మూడు రోజుల్నుంచీ సూరిగాడు రిక్షాని బయటకు తీయలేక పోతున్నాడు. రెండు దేశాభ్యుదయాల పార్టీల మధ్య సంఘర్షణతో నగరమంతా నక్కి కూర్చుండిపోయింది.

ఒకరోజు బంద్!

మరో రోజు అభ్యుదయ పార్టీ వలన బంద్!!

ఇంకోరోజు ఇంకొక పార్టీ వలన రాస్తా



రోకోలు!!!

"దేవుడా! ఏంటిది? ఎందుకీ బందులు, రాస్తారోకోలు? ఇవి పేదలపాలిట రోకళ్ళ పోట్లు తయారౌతున్నాయ్. నా పెళ్ళాం- పిల్లలు ఎట్లా బతికేది?

సూరిగాడు తల బాదుకున్నాడు.

రెండు రోజులు బయటికి వెళ్ళాలంటే వణికిపోయాడు.

ఇప్పుడతని మనసులో తెగింపు వచ్చేసింది.

మెల్లిగా రిక్షాని రోడ్డుమీదికి తీసుకొచ్చాడు.

అంతట నిర్మానుష్యం అలుముకునుంది.

ఔనుమరి. అందరికీభయమే!

అటు పోలీసులు ఇటు అభ్యుదయ పార్టీలు. ఎవరికి కోపం వచ్చినా తనలాంటి బీదోళ్ళ మీదనే.

కానీ, సూరిగాడి హృదయాంతరాలల్లో ఎక్కడో ఏ మూలనో చిన్న ఆశ.

అర్జంటుగా వెళ్ళే గిరాకీలు దొరుకుతారని ఆశ.

ఆ పైసల్తో తన బిడ్డని వో మంచి డాక్టరు దగ్గర చూపించుకోవచ్చనే ఆశ.

సూరిగాడు రిక్షాని మెయిన్‌రోడ్ మీదికి తీసుకొచ్చాడు.

దూరంగా... నినాదాలు చేస్తూ వో అభ్యుదయ పార్టీవాళ్ళు ఎవరైనా షాపులు తెరిస్తే జబర్దస్తీగా మూయించేస్తున్నారు.


ఒకటో అరో రోడ్‌మీద్నుంచీ వెళ్ళే వాహనాలను ఆపి బెదిరిస్తున్నారు.

సూరిగాడికి భయం వేసింది. తను వాళ్ళ కంటపడితే ఇంకేముందీ? తనని తన రిక్షాని బతకనివ్వరు.

అతను రిక్షాని చిన్న సందులో చాటుగా

తీసుకెళ్ళాడు.

మందుల షాపొకటి తెరచినట్లుంది. వాళ్ళు అరుస్తున్నారు. బండబూతులు విసురుతున్నారు. ఐకమత్యం లేదంటున్నారు. స్వార్థపరులు గద్దె దిగాలంటే అందరు ఏకం కావాలని ఈలలు వేస్తున్నారు. డాన్సులు చేస్తున్నారు.




నూరిగాడు తొంగి తొంగి అంతా గమనిస్తున్నాడు.

ఆలోచిస్తున్నాడు.

ప్రత్యర్థులను గద్దెదించాలంటే ఇదేనా మార్గం? చివరికి మందుల షాపు కూడా మూయిస్తే అదెవరికి నష్టం? తన తోటోళ్ళకే కదా!? సాధించడమంటే ఇదేనా?

గాంధీ మహాత్ముడు కూడా చేశాడు. ఎట్లా చేశాడు? ఇట్లా మాత్రం కాదు. అస్సలూ, వీళ్ళు దేశం కోసం చేస్తున్నారా? ఏమో?! నాలుగు పైసలు చేతిలో వడేసి రెండు చుక్కల కల్లో, సారానో వడేస్తే చేసే రకం వీళ్ళది.

డబ్బుకోసం, ఎవరు డబ్బిస్తే వాళ్ళ తరఫున గలాట చెయ్యటమే వీళ్ళ ప్రధాన లక్ష్యం. మూర్ఖులు!!!

నూరిగాడు చదువుకున్న వాడికంటే గొప్పగా తనలో తాను గొణుక్కున్నాడు.

గడబిడ చేస్తున్న వాళ్ళు వెళ్ళిపోయారు.

నూరిగాడి గుండెల్లో మళ్ళీ ధైర్యం తెగింపు పుట్టుకొచ్చాయి.

మెల్లిగా రిక్షాని రోడ్డు మీదికి లాక్కొచ్చాడు.

ఒకతను తనవైపే వరుగెత్తుకుంటూ వస్తున్నాడు- రొప్పుతూ, చెమటలు కక్కుతూ.

నూరిగాడు అదిరిపోయాడు.

వచ్చినతను ఆత్రంగా.

"ఏయ్ రిక్షా! అర్జంటుగా హాస్పిటల్ వెళ్ళాలి. వస్తావా?" అన్నాడు.

నూరిగాడికి ప్రాణం లేచొచ్చింది.

"పదండి, బాబూ! అడ్డదారిన తీసుకెళ్తా."

"నాకోసం కాదు. నా భార్య డెలివరీ, అదే నొప్పులు పడుతోంది. పిచ్చి నా కొడుకుల్తో ఎంత కష్టం వచ్చింది. ఎక్కడ చూసినా బందులు, రాస్తారోకోలు. నడు నడూ నీకెంత కావాలంటే అంతిస్తాను."

అతను జవాబు వినిపించుకోకుండా రిక్షా ఎక్కి కూర్చున్నాడు.

నూరిగాడు అతను చూపించిన దారిలో అతనింటి ముందుకెళ్ళి ఆగాడు. రిక్షా, ఆగక ముందే అతను రిక్షా మీద్నుంచీ దూకి ఇంట్లోకి వరుగెత్తాడు. ఏమాత్రం ఆలస్యం చేయక భార్యని పట్టుకుని తీసుకొచ్చాడు.

నూరిగాడికి పాపం అనిపించింది. తన భార్య కాన్పులో పడిన కష్టాలు గుర్తుకి తెచ్చుకున్నాడు.

ఆవిడ ఇప్పుడో అప్పుడో అన్నట్లు బాధతో మెలికలు తిరిగిపోతూ అతి కష్టంగా రిక్షా ఎక్కింది.

వాళ్ళిద్దరిని ఎక్కించుకుని తన గుడిసె ముందునుంచీ వెళ్ళే సన్నని ఇరుకైన అడ్డదారిలో మెల్లిగా రిక్షా నడుపుతున్నాడు నూరిగాడు.

వేగంగా నడిపితే కుదుపులకి ఆడ మనిషికి ఎంత కష్టమౌతుందో అతనికి బాగా తెలును.

నూరిగాడికి హుషారెక్కువైంది.

"దేవుడా! గిరాకీ ఇప్పించావ్. పైసలకి పైసలొస్తాయి. పున్నెం కూడా దక్కుతుంది" అనుకున్నాడు మనసులో.

నూరిగాడి ఇల్లు దగ్గరయింది.

అంతే!!

నూరిగాడు గుండెల్లో గునపాలు గుచ్చుకున్నాయి.

మూడేళ్ళ బిడ్డని ఎత్తుకుని వాడి భార్య పరుగెడుతూ ఎదురుగా వస్తోంది.

"ఎక్కడికి పోయావ్, మావా? నీ కొరకే ఎదుకుతున్నా . బిడ్డ కండ్లు తేలేస్తుంది. బయమేస్తుంది, మావా! దవాఖానాకి తీసుకెళ్దాం.."

నూరిగాడు ఇరకాటంలో పడ్డాడు.

ఒకే రిక్షాలో నలుగురిని మామూలు సమయాలలో కూర్చోబెట్టుకోవచ్చు. నొప్పులు పడుతూ రిక్షా మొత్తం ఆక్రమించుకొని భర్త ఒడిలో తలాన్చి మూలుగుతున్న ఆమెని చూస్తూ చూస్తూ సర్దుకుని కూర్చోమని ఎట్లా చెప్పాలో తెలీటం లేదతనికి.

"ఏరా, ఎవరు వీళ్ళు?" అడిగాడతను.

"ఇది నా పెండ్లాం బాబు. నా బిడ్డకు రెండ్రోజుల నుంచీ జెరం..."

"అరె! అట్లాగా. ఫర్వాలేదు. మేము కొంచెం సర్దుకుంటాం. పాపని వొళ్ళో కూర్చోబెట్టుకుని కూర్చోమను."

"అట్లాగే బాబూ. మీ బాంచను."

భార్యా బిడ్డల్ని వాళ్ల కాళ్ళ క్రింద కూర్చోబెట్టాడు.

బరువు ఎక్కువ. అడ్డదారి. ఎగుడు దిగుడుల దారి. అయినా నూరిగాడు రొప్పుతూ రవ్వంత వేగంగా తొక్కాలని ప్రయత్నిస్తాడు.

మోకాళ్ళు, పిక్కలు గుంజడం మొదలెట్టాయి.

ఖాలీ కడుపు.

నీరసం.

అయినా రిక్షా తొక్కుతున్నాడు నూరిగాడు.

అప్పుడతనికి గిరాకి ఇచ్చే డబ్బుల మీద ధ్యాసలేదు. రిక్షా క్షేమంగా హాస్పిటల్ వరకు చేరాలి. తన బిడ్డని కాపాడుకోవాలి. అనే ఆత్రం వుంది. ఆవేదన ఉంది. నిస్సహాయత వుంది.

దాన్తోబాటు బందులు నిర్వహిస్తున్న పెద్ద మనుషుల మీద ఉక్రోషం ఉంది.

అడ్డదారి అయిపోయింది.

మెయిన్‌రోడ్డు మీద్నుంచీ రెండొందల మీటర్లు నడిపించీ మళ్ళీ మరో అడ్డదారి తొక్కితే ఇహ ప్రమాదం లేదు. హాస్పిటల్ చేరుకున్నట్లే.

నూరిగాడు కిందికి దిగి మెయిన్ రోడ్ మీదికి వచ్చాడు.

జరగబోయే ప్రమాదం అతనికి ముందే తెలిస్తే అతనేం చేసేవాడో ఆ భగవంతుడికే తెలుసు.

నూరిగాడు అనుకున్నంత అయింది.

అభ్యుదయ పార్టీ వాళ్ళు యమభటుల్లా ఎదురుగా రానే వచ్చారు. వచ్చి రాగానే నూరిగాడి చొక్కా పట్టుకుని.

"ఏందిరా? మేమింత కష్టపడుతుంటే నీకు సమఝ్ కాలేదు బే"

"అది కాదు, దొరా!"

"థూ, నీయమ్మ. గదంతా మాకేం తెల్వదు. దింపేయ్. వీళ్ళని ఇక్కడే దింపేయ్. లేకుంటే నువ్వు నీ రిక్షా ఉండవు మల్లా. దింపూ..."

"అయ్యా.... అయ్యా. ఇది నా బిడ్డ. దవాఖానకి తీసుకెళ్తున్నా. రెండురోజుల కాడ్నుంచీ జెరంతో పరేషాన్ చేస్తుంది. ఆ అమ్మ పాపం నీళ్ళు పోసుకుంది. నొప్పులు పడుతూంది. మీకు దండం పెడతా. గీసారికి వదిలెయ్యండి. మీ బాంచను. మల్ల రిక్షా తొక్క. నిజం, అయ్యా. గీసారికి పోనీయండి.

"నోర్మూయ్, బే! మంచిగా చెబితే నీకు సమఝ్ కాదురా బాడకావ్"

అభ్యుదయ పార్టీ వాళ్ళు నూరిగాడి భార్య రెక్క పట్టుకుని గుంజి పారేశారు. ఆమె బిడ్డతో సహా పక్కనున్న బండరాయి మీదెళ్ళి పడిపోయింది.

ఒళ్ళోని బిడ్డ తలకి బలమైన దెబ్బ తగిలి రక్తం కారసాగింది.

రిక్షాలో కూర్చున్న తను వెంటనే రిక్షా దిగి తన భార్యని రెండు చేతుల్లో ఎత్తుకుని హాస్పిటల్ వైపు వేగంగా నడిచి వెళ్ళిపోయాడు.

"ఒరేయ్, ఈ బేవ్‌కూఫ్‌గాన్ని మళ్లొకసారి ఇట్ల చెయ్యకుండా చెయ్యాలిరా.." అన్నాడు అభ్యుదయ యువకుడు- దేశభక్తుడు.

అంతే. నూరిగాడి రిక్షాని కిందా మీద, అడ్డంగా, నిలువుగా తోచినట్లు పడేశారు.

చక్రాలు బెండ్ అయ్యాయి.

హాండిల్ ఒక పక్కకి తిరిగిపోయింది.

సీట్లు చిందరవందరగా చిరిగిపోయాయి.

నూరిగాడు గుడ్లు తేలేశాడు.

అతనికప్పుడు ఏడ్పు రావటం లేదు.

అతనికప్పుడు కోపం రావడం లేదు.

అతని మెదడు పన్చెయ్యడం మానేసింది.

అభ్యుదయ పార్టీ వాళ్ళు నానా హంగామా చేసేసి వెళ్ళిపోయారు.

నూరిగాడు రిక్షా వైపే చూస్తున్నాడు.

ఆ రిక్షా.

తనకున్న ఒక్కగానొక్క ఆధారం.

ఆ రిక్షా.

ఇప్పుడది పనికి రాకుండా పోయింది.

ఎట్లా?

ఇప్పుడెట్లా??

అతని గుండెల్లో తుపాకులు పేలుతున్నాయి.

అతని మనసులో శాపనార్థాలు మౌనంగా పచార్లు చేస్తున్నాయి.

"మావా!"

గట్టిగా అరచిన భార్య గొంతువిని ఉలిక్కిపడ్డాడు నూరిగాడు.

నిర్జీవమైన చూపులతో అటువైపు చూశాడు.

"మావా! అయిపోయింది. అనుకున్నంత అయిపోయింది. మావా! సూడు, మావా! మన బిడ్డ దిక్కు సూడు మావా..."

ఆమె గుండెలు బాదుకుంటూ, ఏడుస్తుంటే నూరిగాడు మెల్లిగా ఆమె దగ్గరకు వెళ్ళాడు.

బిడ్డని ఒళ్ళోకి తీసుకున్నాడు.

బిడ్డ ఎప్పుడో చల్లబడిపోయింది.

అప్పుడు వచ్చింది ఏడ్పు నూరిగాడికి.

గుండెలు పగిలిపోయేలా అరిచాడు.

"ఒరేయ్, బద్మాష్‌లారా! బందులు; రాస్తారోకోలు ఎందుకురా? ఎవరికోసం రా? దేసం కోసంరా?? దేసమంటే మట్టి కాదురా, మనసులు- అని సినిమా పాట విన్నార్రా మీరు. పోండిరా. పోండి. ఇంకా చంపండి. అందరిని- మాలాంటి పేదోల్లని చంపేసి మజా చేస్కొండిరా..."



## పాపం! నిర్మాత

బులంద్ చిత్రం యొక్క షూటింగ్ మొదలైనపుడు సల్మాన్ ఖాన్— సోమీఅలీల మధ్య జబర్ దస్తీగా రొమాన్స్ నడించింది. సినిమా ఎలా ఎలా పూర్తి కాసాగిందో అలా అలా వీళ్ళ మధ్య మున్న ఆకర్షణ కూడా తగ్గిపోసాగింది. తర్వాత ఏమైందో ఏమో? ఇపుడు ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే మండిపోయే విధంగా తయారయ్యారు ఇద్దరు. బులంద్ చిత్రం ఆగిపోయేలా అయ్యింది.

పాపం! నిర్మాత వీళ్ళ ఆకర్షణ మధ్య నలిగిపోతున్నాడు.